**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**

**తేది : 02 మే, 2022.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**

గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– ఆర్.రాఘవేంద్ర,** సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయం తరపున

**విషయం : విద్యుత్ కోత, నీటి ఎద్దడి అరికట్టాలని కోరుతూ...**

**అయ్యా!**

రాష్ట్రంలో ఏనాడు లేనట్టుగా మార్చి నెలలోనే వేసవి తీవ్రత, ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగాయి. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. విద్యుత్ కోతలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో, అనేక పట్టణాల్లో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తున్నారు. పరీక్షల సీజన్‌లో విద్యార్థులే కాకుండా సాధారణ ప్రజలు కూడా ఉక్కపోతతో పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. మరోవైపు పవర్ హాలిడే ప్రకటించడంతో పరిశ్రమలు దెబ్బతింటున్నాయి. కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. అసలే కరోనా ఇబ్బందుల్లో ఉన్న చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపారస్తులకు దెబ్బ మీద దెబ్బ తగిలి నష్ట పోతున్నాయి. వ్యవసాయానికి అధికారయుతంగానే 9 గంటల నుండి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా తగ్గించినట్లు ప్రకటించారు. ఆచరణలో ఆ ఏడు గంటల విద్యుత్ కూడా అందుబాటులో లేక అనేక పంటలకు నష్టం వాటిల్లుతోంది. మరోవైపు విద్యుత్ కోతల వలన పట్టణాల్లో, గ్రామాల్లో మంచినీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. కేంద్ర ప్రభుత్వం బొగ్గు సరఫరా, మిగులు విద్యుత్ అందించడం తదితర విషయాల్లో వైఫల్యం చెందినా, కేంద్రం మీద ఒత్తిడి తీసుకువచ్చి బొగ్గు, విద్యుత్ సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తగు విధంగా వ్యవహరించక పోవడం బాధాకరం. వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగుతుందని ముందస్తు అంచనాలు ఉన్నప్పటికీ తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించలేదు. బొగ్గు సరఫరాను మెరుగుపరిచి విద్యుత్ థర్మల్ స్టేషన్లు పూర్తి సామర్థ్యంతో పని చేసే విధంగా చర్యలు చేపట్టాలి. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి మిగులు విద్యుత్ రాష్ట్రానికి రాబట్టాలి. అవసరమైన అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేసి విద్యుత్ కొరతను నివారించాలి. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటున్నాయి. వాటికి కావలసిన సబ్సిడీలు, ప్రోత్సాహం ప్రభుత్వం అందించాలి.

అనేక పట్టణాల్లో రెండు, మూడు రోజులకొకసారి మంచినీటి సరఫరా అవుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లోనూ మంచినీటి కొరత తప్పడం లేదు. విద్యుత్ కోతల వలన మంచినీటి ఎద్దడి మరింత తీవ్రం అవుతున్నది. ప్రభుత్వం, స్థానిక సంస్థలు వేసవిలో మంచినీటి ఎద్దడి అరికట్టడానికి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించటంలో లోపం కనపడుతున్నది. నిధుల కొరతతో వేసవిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేయడంలోనూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తక్షణమే స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, పైపులైన్లు వేసి కరువుపీడిత, వర్షాభావ ప్రంతాలకు మంచినీటి సరఫరా చేయాలి. అవసరమైన చోట్ల అదనపు ట్యాంకర్లను పెట్టాలి. కొత్త బోర్లు వేయాలి. మంచినీటి సరఫరా చేసేందుకు విద్యుత్ కోతలు లేకుండా, నిరంతరాయంగా విద్యుత్‌ను అందించాలి. ప్రభుత్వం విద్యుత్ కోతలు నివారించి, మంచినీటి సరఫరా చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి